## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రహమత్ కాలనీ ఫీడర్‌లో ఉదయం 11.30 గంటల నుంచి 12 గంటల వరకు క్రిస్టల్ టౌన్, రహమత్ కాలనీ, మొగల్స్ కాలేజ్, సుభాన్ హిల్స్..

◆ బృందావన్ కాలనీ ఫీడర్‌లో మధ్యాహ్నం 12 గంటల నుంచి 12.30 వరకు బృందావన్ కాలనీ, ప్రగతి కాలనీ, టాటానగర్, మొగల్స్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

**యూనివర్సిటీ, హసన్‌నగర్, శ్రీదేవి ఫీడర్ల పరిధిలో..**

రాజేంద్రనగర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు.యూనివర్సిటీ ఫీడర్ పరిధిలోని గోల్డెన్ సిటీ, డైమండ్ సిటీ, బెస్ట్‌ప్రైజ్, ఖాద్రీ హిల్స్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 3 గంటల వరకు.. హసన్‌నగర్ ఫీడర్ పరిధిలోని హసన్‌నగర్,బాబానగర్, ఇంద్రానగర్, ఎస్టీఆర్‌నగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి 2.30 గంటల వరకు.. శ్రీదేవి ఫీడర్ పరిధిలోని వీకర్‌సెక్షన్‌కాలనీ, శ్రీదేవి ప్రాంతాల్లో మధ్యాహ్నం 3గంటల నుంచి 3.30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

## పేదలకు అండగా ఉంటాం

మణికొండ: వట్టినాగులపల్లి గ్రామానికి చెందిన ఓ నిరుపేద కుటుంబానికి ఆడబిడ్డ వివాహానికి వట్టినాగులపల్లి మాజీ సర్పంచ్ స్వరూపనగేష్ యాదవ్ శుక్రవారం రూ.16వేల ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాట్లాడుతూ...పేదల కష్ట, సుఖాలలో అండగా ఉంటామన్నారు. ఇప్పటి వరకు వంద మందికి పైగా ఇలాంటి సహాయ సహకారాలను అందించామన్నారు. పేదలకు ఎప్పుడూ అండగా ఉంటామని అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.

## సొంత డబ్బుతో రోడ్డుకు మరమ్మతులు

శంషాబాద్ రూరల్: గోతులు పడిన రోడ్డుకు తన సొంత డబ్బులతో మాజీ వార్డు సభ్యుడు మరమ్మతు పనులు చేయించారు. మండలంలోని సుల్తాన్‌పల్లి-కాచారం వెళ్లే మార్గంలో మట్టి రోడ్డు గుంతలు పడి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో మాజీ వార్డు సభ్యుడు కె.వీరచారి తన సొంత డబ్బులు వెచ్చించి రోడ్డుపై మట్టి పోసి గుంతలను పూడ్చివేయించాడు. సుమారు 40 ట్రిప్పుల మట్టి పోయించి చదును చేయించినట్లు తెలిపారు.

## తలసీమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ సందర్శన

రాజేంద్రనగర్: తలసీమియా ఇంటర్నేషనల్ ఫెడరేషన్ (టీఐఎఫ్) ప్రత్యేక ప్రతినిధులు బృందం హైదరాబాద్ శివరాంపల్లిలోని తలసీమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ (టీఎస్‌సీఎస్) ప్రత్యేక యూనిట్ అయిన కమలా హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఫర్ తలసీమియా అండ్ సికిల్ సెల్ పేషెంట్స్ (కేహెచ్‌ఆర్‌సీటీఎస్‌సీఎస్)ను శుక్రవారం సందర్శించింది. ఇది ఒక చారిత్రాత్మక విజయాన్ని సూచిస్తుందని... టీఎస్‌సీఎస్ ప్రపంచ వ్యాప్తంగా అతిపెద్ద, ఉత్తమమైన ఆసుపత్రిగా గుర్తింపు పొందిందన్నారు. తలసీమియా రోగుల సంరక్షణలో అచంచలమైన అంకితభావంతో అవసరమైన వారికి 100 శాతం ఉచిత సేవలను అందిస్తుందన్నారు. ఇటలీ, గ్రీస్‌లో ఉన్న తలసీమియా ఇంటర్నేషనల్ ఫెడరేషన్ నుంచి ప్రముఖ వ్యక్తులతో క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాత ఈ గుర్తింపు టీఎఫ్‌ఐతో ధృవీకరించబడిందన్నారు. ఈ పర్యటనలో ప్రెసిడెంట్ డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్, సీఈఓ అండ్ సెక్రటరీ డాక్టర్ సుమన్ జైన్, వైస్ ప్రెసిడెంట్ రత్నావళి, జాయింట్ సెక్రటరీ అలీమ్ బేగ్, బోర్డు సభ్యులు, ముఖ్య వైద్యులు, సీనియర్ సిబ్బంది పాల్గొన్నారు.


# ఓల్డ్ ఈజ్ గోల్డ్.!

## ఆరోగ్యమే మహా భాగ్యం అంటున్న జనం

- స్టీల్, అల్యూమినియం పాత్రల వల్ల కలిగే అనర్థాలపై పెరుగుతున్న అవగాహన
- మళ్లీ మట్టి పాత్రల వైపు మళ్లుతున్న ప్రజలు



మట్టి కుండలను తయారు చేసి ఎండబెట్టిన దృశ్యం



అమ్మకానికి సిద్ధంగా ఉన్న మట్టి పాత్రలు, కుండలు తదితర వస్తువులు



మట్టిపాత్రను తయారు చేస్తున్న బాలరాజ్



మట్టి పాత్రలను, కుండలను ఎండలో ఆరబెడుతున్న సరళ

అత్తాపూర్: ఆరోగ్య స్పృహ పెరిగి జనం దృష్టి క్రమంగా మట్టి పాత్రల వైపు మళ్లింది. స్టీల్, అల్యూమినీయం లాంటి పాత్రల స్థానంలో మట్టి పాత్రల ప్రవేశిస్తున్నాయి. స్టీల్, అల్యూమినియం లాంటి పాత్రల్లో చేసే వంట వల్ల కలిగే నష్టాలను వైద్య రంగం ఇస్తున్న విస్తృత సమాచారంతో వెనకటి మట్టి పాత్రలే మేలు అనే నిర్ధారణకు వచ్చినట్లు భావించాలి. మట్టి పాత్రల్లో వంటలు కొత్త ఏమీ కాదు. ఒక 50 ఏళ్ల వెనక్కి వెళ్లి నాడు మొత్తం గ్రామీణ భారతం అంతా మట్టి పాత్రల్లో మాత్రమే వంట చేసే వాళ్లు. అల్యూమినియం, స్టీల్ పాత్రలు అందుబాటులోకి రావడం, వాటిల్లో వంట చేయడం సులభంగా ఉండటంతో మట్టి పాత్రలు మాయమైపోయాయి.

◆ వంట చెరుకు స్థానంలో వంట గ్యాస్ అందుబాటులోకి రావడం కూడా మట్టి పాత్రలు దూరం కావడానికి ఒక కారణం అని చెప్పాలి. నగర జీవితంలో వేగం కూడా మట్టి పాత్రలను దూరం చేసింది. అనేక ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ వంట ఉపకరణాలు అందుబాటులోకి రావడం వందల ఏళ్ల పాటు వినియోగించిన మట్టి పాత్రలు దూరమైపోయాయి. వైద్య సౌకర్యాలు పెరగడం, అందరికీ ఇంటర్నెట్ అందుబాటులోకి రావడంతో ఆరోగ్య, వైద్య రంగాలకు చెందిన ఎంతో సమాచారం సామాన్యులకు కూడా చేరువ అయ్యింది. దీంతో ఆరోగ్య స్పృహ పెరిగి పోయింది. వారానికి ఒక్క రోజైనా ఆరోగ్యకరమైన వంటను భుజించాలి అనే సంస్కృతి నగరంలోని మధ్య తరగతిలో క్రమంగా పెరుగుతుంది. ఫలితంగా నగరంలోని అనేక చౌరస్తాల్లో మట్టి పాత్రల అంగళ్లు కనిపిస్తున్నాయి.

◆ అయితే మట్టి పాత్రలు తయారు చేసే కుమ్మరి వృత్తి ఇప్పుడు అంత లాభదాయకంగా లేదు. మట్టిని పాత్రగా మలిచే క్రమంలో అనేక విద్యుత్ పరికరాలు అవసరం ఇప్పుడు పెరిగింది. కుమ్మరి వృత్తిలో ఉన్న వారికి ఈ పరికరాల కొనుగోలు భారంగా మారిపోయింది. జనానికి ఆరోగ్యకరమైన భోజనం అందించేందుకు కుమ్మరి వృత్తిని కాపాడడం అవసరం. ఈ రెండు కోణాలను ప్రభుత్వం గమనించి కుమ్మరి వృత్తిని కాపాడుతూ, ఆరోగ్యకరమైన ఆహారం అందించే దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

### కుండల్లో చేసిన ఆహారం బ్రహ్మాండగా ఉండేది



పూర్వపు రోజుల్లో మన పూర్వీకులు చేసిన మట్టి కుండలో తయారు చేసిన ఆహార పదార్థాలు ప్రతి విటమిన్ దొరికింది. ఈ రోజుల్లో ప్రతి విటమిన్ కోసం టాబ్లెట్ రూపంలో తీసుకుంటున్నారు. కేవలం డబ్బు కోసమే తాపత్రయం తప్ప ఆరోగ్యం మీద ధ్యాస లేకుండాపోయింది. కుండల్లో కులి పెట్టి చేసిన ఆహారం బ్రహ్మండగా ఉండేది పచ్చడి మెతుకులతో ఆ ఆహారం ఎంతో రుచిగా అన్ని రకాల విటమిన్స్ అందేవి వంద సంవత్సరాలు బతుకుతాం అన్న ఆశ ఉండేది పూర్వపు రోజులు మళ్లి మళ్లి రావాలి.

– రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ మున్సిపల్ కమీషనర్ కె.రవికుమార్

### మెలకువలు తెలిసి ఉండాలి



వేసవి కాలంలో కుండలను వాడకంలో ప్రజలు ముందుకు వస్తున్నారు. మట్టి పాత్రలను తయారు చేయడంలో మెలకువలు తెలిసి ఉండాలి. ముడి సరుకును తయారు చేసుకోవడంలో కుమ్మరి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. తయారు చేసిన పాత్రలను ఆరబెట్టి మంచిగా కాల్చుకోవాలి.

– బాలరాజ్ శాలివాహన, ఉప్పర్‌పల్లి

### ప్రత్యేక పాత్రల కొనుగోలు



కుల వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న పిల్లల చదువులు, పెళ్లిళ్ల పేరంటాలు ఈ వృత్తుల ద్వారా సంపాదించిన దాంతో నిర్వహించాం. మట్టి పాత్రలో వంట చేసుకునేందుకు మహిళలు ముందుకు వస్తున్నారు. వీకెండ్స్‌లో బిర్యానీలు చేసుకునేందుకు ప్రత్యేకంగా తయారు చేసిన పాత్రలను కొనుగోలు చేస్తున్నారు. మా వరకు కుల వృత్తిని నమ్ముకుని జీవిస్తున్నాం. మా తర్వాతి తరం ఈ వృత్తిలో కొనసాగాలి.

– సరళ, ఉప్పర్‌పల్లి

### స్థానం కుమ్మరి వారికే..



తెలంగాణ రాష్ట్రంలో కుమ్మరి కులానికి ప్రత్యేక స్థానం ఉంది. వివాహ శుభ కార్యాలయంలో ఎంతో ప్రాముఖ్యత ఉంది. అమ్మావారికి భోనం ఎక్కించిన భోనం దించాలన్న ఆ స్థానం కుమ్మరి వారికే దక్కుతుంది. సాంప్రదాయబద్ధంగా వస్తున్న ఆచారాలకు నియమనిబంధనలకు అనుగుణంగా కుమ్మరి వృత్తిని చేపట్టే వారిని ప్రొత్సహించాలి. కొత్త ప్రభుత్వం నిర్మించిన మోడల్ మార్కెట్స్‌లో దుకాణాన్ని కేటాయించాలి.

– అప్పారెడ్డి ముఖేష్, అత్తాపూర్

# సమన్వయంతో పని చేయాలి

- మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సిబ్బందికి సూచన
- బండ్లగూడ జాగీరు కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర




సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర సూచించారు. కిస్మత్‌పూర్‌లోని కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం కౌన్సిల్‌హాల్‌లో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కమిషనర్ శరత్‌చంద్ర అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసం సందర్భంగా ప్రజలకు అసౌకర్యాలు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. మసీదుల వద్ద ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులను చేపట్టి పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రజలకు అసౌకర్యాలు కలగకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు.

◆ ట్రేడ్ లైసెన్స్‌ను జారీ చేయాలని ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ సర్వే, అడ్వర్ టైస్మెంట్ పన్నుల వసూలు చేపట్టాలన్నారు. ప్రాపర్టీ టాక్స్ కలెక్షన్‌ను మరింత ముమ్మరంగా చేయాలని టార్గెట్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అన్‌అస్సెస్డ్, అండర్ అస్సెస్డ్ వసూలు, ఇంజినీరింగ్ విభాగంలో వివిధ పనుల పురోగతి, స్వయం సహాయ సంఘాల వివిధ లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు.

◆ స్వచ్ఛ సర్వేక్షణ్-2025 సందర్భంగా సిటీజన్స్ ఫీడ్ బ్యాక్, తాగునీటి వనరులపై సమీక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో మేనేజర్ ఈ.మంజులత, డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, వివిధ సెక్షన్ల అధికారులు, అసిస్టెంట్లు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, డీఈవోలు, రిసోర్స్ పర్సన్స్, శానిటరీ జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌జీఐఏలో ఫ్లైయర్స్ క్లబ్ ప్రారంభం

శంషాబాద్: ప్రయాణికులకు ఆతిథ్య సౌకర్యంతో పాటు సమావేశాలు నిర్వహించుకునేందుకు వీలుగా ఐ స్ప్రౌట్ సంస్థ ఫ్లైయర్స్ క్లబ్‌ను శుక్రవారం ప్రారంభించింది. శంషాబాద్ ఎయిర్‌పోర్టు టెర్మినల్‌కు చేరువలో ఏర్పాటు చేసిన ఫ్లైయర్స్ క్లబ్ అత్యధిక ప్రయాణికులు చేస్తున్న వారికి ఆధునిక సౌకర్యాలను అందిస్తోందని సంస్థ సీఈఓ సుందరి పాటిబండ్ల అన్నారు. వివిధ రంగాల్లోని నిపుణులు ప్రయాణానికి పనికి మధ్యన ఉన్న అంతరాన్ని సులభంగా తొలగించేందుకు ఈ ఫ్లైయర్స్ క్లబ్ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, జీఎంఆర్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## జర్మన్‌టెన్ ఆస్పత్రి వైద్యుల అరుదైన శస్త్రచికిత్స



అత్తాపూర్: దురదృష్టవశాత్తు పటాకులు పేలిన సంఘటనలో పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన రఫీమీయా(11) మోచేతి వేళ్లు పోయాయి. హైదరాబాద్ జర్మన్ ఆస్పత్రి వైద్యులు అది మాత్రం టెక్నాలజీ సహాయంతో చేతి వేళ్లను సృష్టించి శస్త్రచికిత్సను విజయవంతం చేశారు. కాలు మధ్యపాదంలో ఉన్న రెండో వేలును తీసి చేతికి అమర్చారు. వైద్యం అందించిన జర్మన్‌టెన్ ఆస్పత్రి బృందానికి ఆపరేషన్ కోసం సహాయం చేసిన దాతలకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## రోడ్డు పనులు చేపట్టి త్వరగా పూర్తి చేయాలి



మైలార్‌దేవ్‌పల్లి: వీలైనంత త్వరగా అభివృద్ధి పనులను ప్రారంభించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని శాంతినగర్ అయ్యప్ప స్వామి దేవాలయం పరిసర ప్రాంతాల్లో నూతన పైపులైన్, సీసీ రోడ్డు పనులపై ఆయన ఆరా తీశారు. జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి బస్తీలలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుంటున్నానని పేర్కొన్నారు. నూతన పైపులైన్ పనులు రోడ్డు పనులను చేపట్టి త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సమస్యలు వస్తే తనకు తెలపాలని ఇబ్బందులు లేకుండా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నర్సిరెడ్డి, రమేష్‌రెడ్డి, రాజు, తలారి చిన్న, కొండల్ ముదిరాజ్, అంజి, మహమ్మద్, పాండుయాదవ్, శంకర్‌రెడ్డి, జలమండలి మేనేజర్ రేణుక, ప్రసాద్, జీహెచ్ఎంసీ ఏఈ నర్సింహమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## అన్ని దానాల్లో అన్నదానం ఎంతో గొప్పది

మైలార్‌దేవ్‌పల్లి: అన్ని దానాల్లో అన్నదానం ఎంతో గొప్పదని మార్కండేయ నగర్ పోచమ్మ ఆలయ కమిటీ నిర్వాహకులు, నవోదయ యూత్ కమిటీ సభ్యులు వెల్లడించారు. అమావాస్య సందర్భంగా మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మార్కండేయనగర్ పోచమ్మ దేవాలయం ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు అన్నదానం స్వీకరించడానికి పెద్ద ఎత్తున తరలి వచ్చారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు తగు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో గద్దె కృష్ణ, పడిగిమర్రి సూర్యనారనాయణ, కైరంకొండ శంకర్, శిరాందాస్ నరేందర్, కోట శ్యామ్, వర్కల చందు, నరేష్, నర్సింహ్మా, నవోదయ యూత్ అధ్యక్షులు కోట పవన్, యూత్ కమిటీ సభ్యులు మల్లేష్, ప్రభాకర్, విజయ్, అరుణ్, శివ, భరత్, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానం చేయటం ఎంతో ఆనందం

మణికొండ: ఆకలితో ఉన్న పేదలకు అన్నదానం చేయటం ఎంతో ఆనందంగా ఉందని మణికొండ వాసవీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓలం యాదగిరి అన్నారు. శుక్రవారం అమావాస్యను పురస్కరించుకుని అలకాపూర్ టౌన్‌షిప్‌లోని వారి కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి నెల అమావాస్య రోజు క్రమం తప్పకుండా తమ అసోసియేషన్ తరపున అన్నదానం చేస్తున్నామని అన్నారు. అన్నదానంతో పాటు అనేక సేవా కార్యక్రమాల నిర్వహణలో తమ సభ్యులు ముందుంటున్నారని అన్నారు. రాబోయే రోజుల్లోనూ మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని అన్నారు.



# సర్ సీవీ రామన్ గొప్ప శాస్త్రవేత్త

### నియోజకవర్గంలో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

రాజేంద్రనగర్: శివరాంపల్లిలోని జడ్‌పీహెచ్‌ఎస్ పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ప్రధానోపాధ్యాయులు కిషన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ శంకర్ రాథోడ్, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పడమటి శ్రీధర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. సర్ సీవీ రామన్ గొప్ప భౌతికశాస్త్రవేత్త అని అన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని బాల, బాలికలు శాస్త్రవేత్తలు కావాలన్నారు. పడమటి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులు మంచి ప్రాజెక్ట్‌లు చేసి ప్రదర్శించారని అభినందించారు. విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. సైన్స్ డే సందర్భంగా నిర్వహించిన క్విజ్, వ్యాసరచన, డ్రాయింగ్, స్పీచ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు శ్రీధర్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు సుదర్శన్, సరళమ్మ, వసుంధర, కరుణాకర్, సురేశ్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీదేవి, సునీత, ఎట్టప్ప, సులక్షణ, రత్నప్రభ, మాధవి, పాఠశాల ఉపాధ్యాయులు జనార్దన్‌చారి, వెంకటయ్య, అంజయ్య, మొగులయ్య, సుధాకర్, మహిళా ఉపాధ్యాయులు అనురాధ, రూపాదేవి, మహేశ్వరి, యామిని, ప్రమీద, ఉదయలక్ష్మి, పద్మ, కవిత, సంధ్య, ఉదయశ్రీ, రిజ్వానా, పుష్పలత పాల్గొన్నారు.

**దుర్గానగర్ పాఠశాలలో..**

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ దుర్గానగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల సైన్స్ టీచర్లు విద్యార్థుల్లో పరిశోధనా శక్తిని పెంపొందించేలా సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. విద్యార్థులు పరిశోధనలపై దృష్టి పెట్టేలా ఉపాధ్యాయులు ప్రొత్సహించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై.సుజాత అన్నారు. నేటి సమాజంలో సైన్స్ ప్రాముఖ్యత ఎంతో ఉందన్నారు. సీవీ రామన్ కనుగొన్న రామన్ ఎఫెక్ట్‌ను విద్యార్థులకు అర్థం అయ్యేలా నేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జ్యోతి, వెంకటరాములు, పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

మణికొండ: భౌతిక శాస్త్రవేత్త సీవీ రామన్ జయంతిని పురస్కరించుకుని మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సైన్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి హాజరై విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నిరంజన్,మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు రవికాంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.







## 'విజ్ఞాన్ వైభవ్'కు శారదా విద్యామందిర్ విద్యార్థులు

శంషాబాద్: కేంద్ర రక్షణ మంత్రిత్వశాఖ, కలాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్, ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించిన విజ్ఞాన్ వైభవ్ కార్యక్రమానికి పట్టణంలోని శారదా విద్యామందిర్ విద్యార్థులకు ప్రత్యేక ఆహ్వానం రావడంతో ఉపాధ్యాయులతో కలిసి వెళ్లారు. డీఆర్‌ఎస్‌డీఓ మాజీ చైర్మన్ సతీష్‌రెడ్డి ఈ సందర్భంగా వారితో కలిసి పలు పరిశోధన అంశాలపై ప్రత్యేకంగా మాట్లాడారు. మన జీవితంలో ప్రతి అంశం సైన్స్‌తో ముడి పడి ఉందని సూచించారు.



## అందరి సహకారంతోనే మహాశివరాత్రి ఉత్సవాలు విజయవంతం



అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ రాంబాగ్‌లోని చిన్న అనంతగిరి శివాలయంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి మహోత్సవాలను విజయవంతం చేసిన వివిధ శాఖల అధికారులకు శ్రీప్రణవ భక్త సమాజం అధ్యక్షుడు మోంద్ర నర్సింహ కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం దేవాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మూడు రోజుల పాటు ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించామన్నారు. ఈ ఉత్సవాలకు డీసీపీ చింతమనేని శ్రీనివాస్, ఏసీపీ శ్రీనివాస్, జోనల్ కమిషనర్ వెంకన్న, డిప్యూటీ కమీషనర్ రవికుమార్, ట్రాఫిక్ పోలీసులు, మెడికల్ ఆఫీసర్లు, శానిటేషన్ అధికారులు, సిబ్బంది ఎంతో సహకరించి భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో బర్ల మల్లారెడ్డి, నారగూడెం మల్లారెడ్డి, అశోక్, రామేశ్వరరావు, కొలన్ సుభాష్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, మేడం మధు, ఎల్.వెంకటేష్, విజయ్‌కుమార్, బాలసుబ్రహ్మణ్యం, శ్రీకాంత్ తదితరులున్నారు.

## నకిలీ పత్రాలతో కబ్జాకు యత్నించిన మహిళ అరెస్ట్

రాజేంద్రనగర్: నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలతో ఏడు కోట్ల విలువైన స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించిన ఓ మహిళను రాజేంద్రనగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మరికొంత మంది పరారీలో ఉన్నారని.. వారిని త్వరలో అరెస్ట్ చేస్తామని ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో వెల్లడించారు. రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పద్మశ్రీ హిల్స్ కాలనీలోని 6 గజాల స్థలం నగరంలోని ఓ మహిళ గతంలో కొనుగోలు చేసింది. ప్రస్తుతం ఇక్కడ గజం స్థలం ఒక లక్ష 25 వేలకు పైగా ధర పలుకుతుంది. ఈ స్థలంపై కన్నేసిన నాగోల్‌కు చెందిన సుభాషిని (38) నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలను సృష్టించింది. అనంతరం ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించింది. ఈ విషయం తెలుసుకున్న ఆసలు ఓనర్ రాజేంద్రనగర్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు విచారించి పత్రాలను పరిశీలించారు. సుభాషిని పత్రాలు నకిలీగా తేల్చి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మరికొంత మంది ఉన్నారని వారిని సైతం అరెస్ట్ చేస్తామని ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు.



## బృంగీశ్వర సేవ..

మణికొండ: మంచిరేవులలోని మచిలేశ్వరస్వామి, వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున బృంగీశ్వర సేవ నిర్వహించారు. స్వామివారిని మంచిరేవుల గ్రామం నుంచి దేవాలయం వరకు బృంగీశ్వర వాహనంపై ఊరేగించారు. మహా శివరాత్రిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తారు. గ్రామానికి స్వామివారు రావటంతో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున నందీశ్వర సేవ, రథోత్సవం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని అర్చకులు తెలిపారు.